హుస్నాబాద్‌లో నేటి నుంచి 'మోదీ గిఫ్ట్' సైకిళ్ల పంపిణీ

శెనార్తి మీడియా, కరీంనగర్/హుస్నాబాద్:

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో శనివారం ఉదయం 11 గంటలకు టెన్త్ విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. బండి సంజయ్ నిర్ణయంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, శిశుమందిర్‌లలో చదివే దాదాపు 20 వేల టెన్త్ విద్యార్థులకు కార్పొరేట్ సీఏస్సార్ ఫండ్స్ ద్వారా సైకిళ్లను అందిస్తున్నారు. ఈనెల 9న కరీంనగర్‌లో, 15న సిరిసిల్లలో, 17న హుజూరాబాద్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రస్తుతం హుస్నాబాద్‌కు చేరింది.

ఈ సైకిళ్ల పంపిణీ వెనుక ఓ చిన్నారి కథ ఉంది. నందన్ బామిని గ్రామంలో ఓ పేద బాలుడు రాంచరణ్ "నాకు సైకిల్ ఇస్తే స్కూల్‌కి వెళతాను" అన్న మాట బండి సంజయ్‌ను ప్రభావితం చేసింది. ఆ సంఘటన తర్వాతే విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పంపిణీలో పారదర్శకతకు జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులను భాగస్వాములుగా చేశారు. ఇప్పటికే సైకిళ్లు పొందిన విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోతుండగా, ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితాల్లో మార్పుకు నాంది అవుతోంది.

దోమల నివారణకు ఫ్రైడే డ్రైవ్

శెనార్తి మీడియా, మంచిర్యాల:

జిల్లాలో కీటకజనిత వ్యాధుల నివారణకు మంగళవారం, శుక్రవారం 'ఫ్రైడే డ్రైవ్' కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రాజ్ సూచించారు. శుక్రవారం నస్పూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దోమల నివారణపై చురుకైన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. మలేరియా, డెంగ్యూ, చికన్‌గునియా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపించే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వాటర్ కూలర్లలోని నీటిని తరచూ మార్చాలని తెలిపారు. దోమతెరలు వినియోగించడాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి కుటుంబం వారానికి కనీసం రెండు రోజులు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగ్యూ వంటి వైరల్ జ్వరాల పరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజలను అనవసరంగా భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.అనిత, డాక్టర్ వెంకటేశ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మాస్ మీడియా అధికారి బుక్కం వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వడ్డీ వేధింపులు తాళలేక ఫోటోగ్రాఫర్ ఆత్మహత్య

శెనార్తి మీడియా, శంకరపట్నం:

అప్పుల భారం తట్టుకోలేక శంకరపట్నం మండలం కేశవపట్నంలో ఫోటోగ్రాఫర్ ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుర్రం రామారావు (రాములు) స్థానికంగా ఫోటో స్టూడియో నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. తణుకు ప్రకాష్, తణుకు లక్ష్మీనారాయణల వద్ద నుంచి రాములు అప్పుగా డబ్బు తీసుకున్నట్లు తెలుస్తోంది. వడ్డీలు చెల్లిస్తూ వస్తున్నప్పటికీ మొత్తం అప్పును వెంటనే తీర్చాలని వారు తరచూ ఒత్తిడి చేసారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల రాములు ఇంటికి వచ్చి డబ్బు చెల్లించాలని తీవ్రంగా ఒత్తిడి చేయడంతో మరో ఆరు నెలల గడువు కావాలని కోరాడని, పెద్దమనుషుల సమక్షంలో రాసి ఇచ్చిన పత్రం కూడా ఉన్నట్లు చెప్పారు. అయితే ఈ నెల 21న మళ్లీ ఇంటికి వచ్చి డబ్బులు కట్టాలంటూ ఒత్తిడి చేయడం, ఇంటికి తాళం వేసి పరువు తీశారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా "డబ్బులు కట్టకపోతే పురుగుల మందు తాగు" అంటూ మాటలు మాట్లాడారని బంధువులు ఆరోపించారు. వీటి కారణంగా మానసికంగా కుంగిపోయిన రాములు శుక్రవారం తెల్లవారుజామున గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తక్షణమే హుజురాబాద్ ఆసుపత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు రాములు అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. అప్పు ఇచ్చిన వారు ఇంటికి తాళం వేసి పరువు తీశారని, ఆ మనస్తాపంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని రాములును భార్య కళావతి కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

కరెంట్ షాక్ తో ఆరు గొర్రెలు మృతి

శెనార్తి మీడియా, శంకరపట్నం: శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామంలో కరెంట్ షాక్ కారణంగా ఆరు గొర్రెలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాకరపు మొండయ్య రోజు మాదిరిగా తన గొర్రెలను మేతకు తీసుకువెళ్ళాడు. సాయంత్రం తిరిగి వస్తున్న సమయంలో గ్రామంలో ఉన్న పోల్‌కు సపోర్ట్ వైర్ లోకి గొర్రెలు తగలడంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురయ్యాయి. ఈ ఘటనలో ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంతో సుమారు 80 నుండి 90 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు బాకరపు మొండయ్య తెలిపారు.

వర్షా కాలంలో అప్రమత్తంగా ఉండాలి :ఎస్పీ పవార్

శెనార్తి మీడియా, నల్లగొండ:

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పోలీసూధికారి శరత్ చంద్ర పవార్ సూచించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు నిర్లక్ష్యంగా ఉండరాదని, అత్యంత అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. వాహనదారులు అధిక వేగంతో వాహనా లు నడపరాదని, జారిపడి ప్రమాదం సంభ వించే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు తమ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దని, విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఎలాంటి ఆచేతక చర్యలు తీసుకోవద్దని హెచ్చరించారు. పాత భవనాలు, శిథిలా వస్థలో ఉన్న ఇళ్లు, చెట్ల కింద ఉండరాదని, విద్యుత్ సరఫరా జరిగే లైన్‌ల కింద నిలుచోవద్దని స్పష్టం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, చెరువులు, కాలువలు దాటకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రానున్న మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నం దున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేయాలని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పనిచేస్తోందని, ప్రజల ప్రాణ భద్రత కోసం అవసరమైన సహాయాన్ని అందిస్తుందని తెలిపారు.

తెలంగాణ కుల గణనతో హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్

- **బీసీ రిజర్వేషన్లను నీరుగార్చే కుట్రలో బీజేపీ**
- **కాంగ్రెస్ ఢిల్లీ సమావేశాల్లో అన్ని అంశాలు చర్చించాం**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

న్యూఢిల్లీ,జూలై25 :

ఢిల్లీలో అఖిల భారత నాయకత్వంతో కీలక సమావేశాలు జరిగాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న ఖర్గే నివాసంలో తెలంగాణలో కులగణన, బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగింది.. భారత్ జోడో యాత్రలో అసమానతలు గమనించి కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.. కేంద్రంలో అధికారంలోకి రాకపోయినా.. తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు– చేసిన కాంగ్రెస్ కుల గణన చేసింది అన్నారు. 56 ప్రశ్నలతో.. 150 ఇండ్లను ఒక బ్లాక్ గా చేసి, శాస్త్రీయ బద్ధంగా కులగణన చేశాం.. సర్వేలో మూడున్నర కోట్ల ప్రజలు స్వచ్ఛందంగా తమ సమాచారం ఇచ్చారు.. బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ కు పంపించాం.. రాష్ట్రపతి వద్ద పెండిరగ్ లో ఉంది.. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కాంగ్రెస్ ఆలోచిస్తుంది.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు– కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చాం.. తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి అద్భుతమైన సర్వేను సిద్ధం చేశారనీ అగ్రనాయకులు చెప్పారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

గద్దపాకలో సీజనల్ వ్యాధులపై అవగాహన

శెనార్తి మీడియా, శంకరపట్నం:

శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన సభ జరిగింది. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, పౌష్టికాహారంపై వైద్యాధికారి శ్రావణ్ కుమార్ అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, గర్భిణీలు, బాలింతలు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులను నివారించేందుకు శుభ్రత పాటించడం, సకాలంలో వైద్యం తీసుకోవడం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అనిల్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, ఏఎన్ఎం జ్యోతి, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రతి ప్రాథమిక పాఠశాలకూ హెచ్ఎం పోస్టు మంజూరు చేయాలి

- **బెజ్జంకిలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు**

శెనార్తి మీడియా, బెజ్జంకి: మండలంలోని ఎంపీపీఎస్ బెజ్జంకి, దాచారం, ముత్తన్నపేట, ఎక్స్ రోడ్, వీరాపూర్, లక్ష్మీపూర్, బేగంపేట, వడ్లూర్, గూడెం, కల్లెపల్లి, నర్సింలపల్లి, మోడల్ స్కూల్ తదితర ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పీఎస్ హెచ్ఎం పోస్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏను వెంటనే చెల్లించాల న్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నారొజు శంకరాచారి, ప్రధాన కార్యదర్శి రామంచ రవీందర్, ఎస్టీయూ నాయకులు తిరుమలేష్, సతీష్ కుమార్, ఉండ్రాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పారువెళ్లలో వ్యవసాయంపై అవగాహన సదస్సు

శెనార్తి మీడియా, గన్నేరువరం:

గన్నేరువరం మండలం పారువెళ్ల గ్రామంలో శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ అధికారుల పర్యటన జరిగింది. ఈ సందర్భంగా వారు రైతులకు పలు పంటలపై అవగాహన కల్పిస్తూ, సాగులో అనుసరించవలసిన మెళుకువలపై సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ, అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల నేల ఉపాదేయత తగ్గిపోతుందని, ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రైతులకు వివరించారు. తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని, మట్టిలో ఉన్న పోషకాలను దృష్టిలో పెట్టుకుని పంటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, సహాయ అధికారి అనూష, కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు వెంకటరెడ్డి, అన్నప్ప గౌడ్, బసవన్న పాల్గొన్నారు. గ్రామంలోని పలువురు రైతులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

మహాశక్తి ఆలయంలో భక్తుల రద్దీ

శెనార్తి మీడియా, కరీంనగర్

కరీంనగర్ చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి దేవాలయంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా భక్తులతో రద్దీ మారింది. ప్రత్యేకంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్లకు ఓడి బియ్యం సమర్పించి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగ ణం జనసంద్రంగా మారగా, ముగ్గురు శక్తి స్వరూపిణులను పూజించిన వారికి ఐశ్వర్యం, సౌభాగ్యం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. శ్రావణ శుక్రవారం లక్ష్మీదేవికి ప్రీతికరమని, ప్రతి శుక్రవారం ఉదయం అభిషేకాలు, సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయని వెల్లడించారు.